

కురవి మండలం పెద్ద తండాలో సత్యవతి రాథోడ్ సోదరుడి దశదినకర్మకు వచ్చి వెళ్తుండగా హరీశ్‌రావును పిలిచి రైతుబంధు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న వీరన్న

# హరీశ్ అన్నా.. రైతుబంధు రాలె!

- **మానుకోట జిల్లాలో రైతు మొర**
- **కేసీఆర్ ప్రభుత్వంలోనే బాగున్నదని వ్యాఖ్య**

మహబూబాబాద్, డిసెంబర్ 29 నమస్తే తెలంగాణ: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడి దశదిన కార్యక్రమానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊహించని పరిణామం ఎదురైంది. ఓ రైతు ఆయన దగ్గరికి వచ్చి అన్నా.. రైతుబంధు రాలేదని మొర పెట్టుకోవటం కనిపించింది. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్ద తండాలో శుక్రవారం సత్యవతి సోదరుడు గుగులోత్ కిషన్ నాయక్ దశదిన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియ, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణరెడ్డి హాజరై నివాళి అర్పించారు. కిషన్ నాయక్ కుటుంబసభ్యులను పరామర్శించి, ఇంటి బయటికి వస్తుండగా, ఒక్కసారిగా పెద్ద కేక వినిపించింది. హరీశ్ అన్నా! అని ఓ రైతు గట్టిగా అరిచాడు. ఎవరా? అని అంతా అటువైపు చూశారు. ఆ వ్యక్తి హరీశ్‌రావు దగ్గరికి వచ్చి దీనంగా.. 'అన్నా! ఇంకా రైతుబంధు పడలే. పెట్టుబడికి ఇబ్బంది అవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రెండు పంటలకు ఠంచనుగా పెట్టుబడి సాయం పడేది. ఇప్పుడు ఇంకా పడలే' అని వివరించాడు. రైతు బాధను అర్థం చేసుకున్న హరీశ్‌రావు.. ఏమీ అనకుండా సైలెంట్‌గా ఉండిపోయారు. హామీ ఇద్దామంటే అధికారంలో లేరు, ప్రభుత్వంపై విమర్శలు చేద్దామంటే సరైన సమయం కాదని.. ఏమీ మాట్లాడకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా దశదిన కర్మకు వచ్చినవాళ్లంతా రైతుబంధు ఇంకా రాలేదన్న అంశంపైనే చర్చించుకోవటం కనిపించింది. దీనిపై వీరన్నను 'నమస్తే తెలంగాణ' ఆరా తీయగా.. తనకు ఐదెకరాల భూమి ఉన్నదని, ఏటా వానకాలం, యాసంగిలో రెండు పంటలకు కేసీఆర్ ప్రభుత్వం సమయానికి రైతుబంధు ఇచ్చేదని తెలిపాడు. ప్రభుత్వం మారిన తరువాత ఇప్పటివరకూ రాలేదని తన ఇబ్బందిని వివరించాడు. ఐదెకరాల్లో రెండెకరాల్లో పొలం, మూడెకరాల్లో మిర్చి తోటను సాగు చేస్తున్నట్టు వెల్లడించాడు. ఐదు ఎకరాలకు ఈ సీజన్లో రూ.25,000 రావాల్సి ఉండగా, నయాపైసా రాలేదని చెప్పాడు. పనిచేసే ప్రభుత్వం రానందుకు ప్రతి ఒక్క రైతు బాధ పడుతున్నాడని ఆవేదన వెలిబుచ్చాడు.

## భార్యతో వీడియో కాల్ మాట్లాడుతూ ఆత్మహత్య

ఉప్పల్, డిసెంబర్ 29: కుటుంబ కలహాలతో మెట్రోరైల్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదాద్రి జిల్లా పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ముప్పిడి నరేశ్ (28) హైదరాబాద్ ఉప్పల్‌లోని సరస్వతికాలనీలో ఉంటూ మెట్రో రైల్ సిగ్నల్ విభాగంలో పనిచేస్తున్నాడు. అతని భార్య గర్భవతి కాగా, శనివారం సీమంతం జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమం కోసమే ఆమె కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. సీమంతానికి తమ కుటుంబాన్ని ఎందుకు పిలువలేదంటూ నరేశ్ శుక్రవారం భార్యకు వీడియో కాల్ చేసి గొడవ పడినట్టు సమాచారం. ఇదే విషయమై భార్యాభర్తలిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాదన జరగగా, నరేశ్ మనస్తాపం చెందాడు. భార్యతో వీడియో కాల్ మాట్లాడుతూనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఆమె పక్కింటి వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి చూసేలోపే ప్రాణాలు విడిచాడు.

# 'గృహజ్యోతి' కోసం పాతమీటరుతో..

**వృద్ధురాలి అమాయకత్వానికి అధికారుల విస్మయం**

మంగపేట, డిసెంబర్ 29: గృహజ్యోతి పథకం కింద ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు సౌకర్యం కోసం ఓ వృద్ధురాలు పాత మీటరుతో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ వద్దకు వచ్చి అధికారులను విస్మయానికి గురిచేసింది. ములుగు జిల్లా మంగపేట మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు పోలబోయిన బాయమ్మకు గుడిసె ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం అది కూలిపోగా పక్కనే మరో ఇల్లు కట్టుకున్నది. అందులో నివాసముంటున్నా కరెంటు మీటరు లేదు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసేందుకు బాయమ్మ గురువారం ప్రజాపాలన గ్రామసభకువచ్చింది. ఆధార్ వివరాలతోపాటు, పాత గుడిసెకు చెందిన వినియోగంలో లేని ఓ మీటరు తీసుకురాగా.. ఆమె అమాయకత్వానికి అధికారులు విస్మయానికి గురయ్యారు. పాత మీటరుతో గృహజ్యోతికి దరఖాస్తు చేయడం వీలు కాదనడంతో తన ఇంటికి ఉచిత కరెంటు ఎట్లా? అని అమాయకంగా అక్కడే ఉండిపోయింది. అయితే పంచాయతీ కార్యదర్శి రాంబాబు ఆమెకు అవగాహన కల్పించి పంపించారు.



గృహజ్యోతి పథకం దరఖాస్తు కోసం పాత మీటరుతో వచ్చిన వృద్ధురాలు బాయమ్మ

## ఎన్‌ఐఏ ఎస్పీగా విష్ణు వారియర్



ఖమ్మం మామిళ్లగూడెం, డిసెంబర్ 29: ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌ను కేంద్ర ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. డిప్యూటేషన్‌పై ఐదేండ్లపాటు ఆయన ఎన్‌ఐఏ ఎస్పీగా విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది. 2013 తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వారియర్ మూడేండ్లుగా ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను వెంటనే తెలంగాణలో విధుల నుంచి రిలీవ్ చేసి, కేంద్ర హోంశాఖలో రిపోర్టు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని సీఎస్ శాంతికుమారికి లేఖ అందింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు వారియర్ కేంద్ర సర్వీసులో తన సేవలు అందించనున్నారు.

## ఇల్లు ఖాళీ చేసిన ఐపీఎస్ నవీన్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 29: నకిలీ పత్రాలతో మాజీ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటిని ఆక్రమించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి నవీన్ ఎట్టకేలకు ఆ ఇంటిని ఖాళీ చేశారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో తన ఇంటిని ఆక్రమించేందుకు నకిలీ పత్రాలు సృష్టించారని ఐపీఎస్ అధికారిపై మాజీ ఐఏఎస్ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు నవీన్‌ను విచారించిన నేపథ్యంలో సదరు ఇంటిని ఖాళీ చేశారు.

## స్టాఫ్‌నర్స్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో గందరగోళం

- **తక్కువ మార్కులు వచ్చినా మెరిట్ జాబితాలో చోటు**
- **కొత్తగా జతచేసిన 1800 పోస్టుల్లో మాకు అన్యాయం**
- **రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద ఆరోజోన్ అభ్యర్థుల ఆందోళన**
- **ఫలితాల వెల్లడిలో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం**

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 7 వేల స్టాఫ్ నర్స్ పోస్టల భర్తీకి శుక్రవారం ప్రారంభమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ తీవ్ర గందరగోళానికి దారితీసింది. బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో శుక్రవారం నుంచి అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభించారు. అయితే, పోస్టుల భర్తీలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంత మంది అభ్యర్థులు కోఠిలోని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద ఆందోళన చేపట్టారు. మెరిట్ లిస్ట్ తప్పుల తడకగా ఉన్నదంటూ మండిపడ్డారు. తమకంటే తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయని తమ నంబర్లు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. ఏండ్లుగా కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నా వెయిటేజీకి సంబంధించిన మార్కులు కలపలేదని మరి కొందరు ఆరోపించారు. కొత్తగా జత చేసిన 1800 పోస్టుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ 6వ జోన్‌కు చెందిన కొందరు అభ్యర్థులు వాపోయారు. కేవలం 11 పోస్టులు మాత్రమే కలిపారంటూ మండిపడ్డారు. దీంతో మిగతా జోన్లలో తక్కువ మార్కులు వచ్చినవారికి కూడా పోస్టింగ్ వచ్చిందని, తమకు ఎక్కువ మార్కులున్నా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన బోర్డు అధికారులు.. అభ్యర్థుల అందరి నుంచి రాతపూర్వక ఫిర్యాదులు తీసుకున్నారు. ఒకవేళ ఎవరికైనా అన్యాయం జరిగినట్టు తేలితే.. తిరిగి మెరిట్ లిస్ట్‌లో పెట్టి, వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు.

**అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం..**

స్టాఫ్ నర్స్ పోస్టుల ఫలితాల వెల్లడిలో బోర్డు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ఇవన్నీ జోనల్ క్యాడర్ పోస్టులు. కాబట్టి మెరిట్ జాబితాలో జోన్ల వారీగా ఫలితాలు వెల్లడించాల్సి ఉంటుంది. ఏయే జోన్‌లో కటాఫ్ ఎంత ఉన్నదో, ఎంత మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పిలిచామో స్పష్టంగా వివరించాలి. కానీ, కనీసం జోన్ల వారీగా మెరిట్ లిస్టులు కూడా ఇవ్వలేదు. జోన్ల వారీగా కటాఫ్ ప్రకటించలేదు. ఫలితంగా చాలామంది తమకంటే తక్కువ మార్కులు వచ్చిన వారి హాల్ టికెట్ నంబర్లు మెరిట్ లిస్టులో కనిపించడం చూసి కంగుతిన్నారు. తమకు అన్యాయం జరిగిందంటూ ఆందోళన చేపట్టారు. జోన్ల వారీగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల వివరాలు, కటాఫ్ వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

- **ట్రాన్స్ 'ఫార్మర్' కష్టాలు..**



*భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వావిళ్లపల్లిలో కరెంటు కోతలపై రైతులు ఆందోళనకు దిగారు. మండలంలో రోజుకు 8గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నారని.. అదికూడా ఉదయం 4 నుంచి 7వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం మరో 3గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కరెంటుకోతలతో నాలుగు రోజుల్లో నాలుగుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందంటూ కరెంటు తీగలను పట్టుకొని ఇలా నిరసన తెలిపారు. - సంస్థాన్ నారాయణపురం*

# సార్వత్రిక సమరానికి సన్నాహం

- **3 నుంచి బీఆర్ఎస్ వరుస సమావేశాలు**
- **తెలంగాణ భవన్‌లో ముఖ్యనేతలతో భేటీలు**
- **పాల్గొననున్న కేటీఆర్, ఇతర ముఖ్యనేతలు**

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికల పోరుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సిద్ధమవుతున్నది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు జనవరి 3వ తేదీ నుంచి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు ఈ సమావేశాల్లో పాల్గొననున్నారు. తెలంగాణ భవన్ వేదికగా మొత్తం రెండు విడతల్లో 16 రోజులపాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మొదటి విడుత సమావేశాలు జరుగుతాయి. సంక్రాంతి నేపథ్యంలో మూడురోజుల విరామం తర్వాత 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మిగతా నియోజకవర్గాల సమావేశాలు జరుగనున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతో మొదలై హైదరాబాద్, సికింద్రాబాద్‌తో ఈ సమావేశాలు ముగియనున్నాయి. సమావేశాలకు ఆయా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎంపీలు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, జిల్లాపార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు హాజరు కానున్నారు. ఈ సమావేశాల్లో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. నేతల అభిప్రాయాలు తీసుకుని పటిష్ఠమైన కార్యాచరణను రూపొందించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చాలా చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన నేపథ్యంలో.. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. సమీక్షల అనంతరం ప్రజాక్షేత్రంలో ప్రచారపర్వాన్ని బలంగా నిర్వహించేందుకు పార్టీ యంత్రాంగం కసరత్తు చేస్తున్నది.

**సన్నాహక సమావేశాల వివరాలు ఇలా..**

| తేదీ | లోక్‌సభ స్థానం | తేదీ | లోక్‌సభ స్థానం |
|---|---|---|---|
| జనవరి 3 | ఆదిలాబాద్ | జనవరి 11 | మహబూబాబాద్ |
| జనవరి 4 | కరీంనగర్ | జనవరి 12 | భువనగిరి |
| జనవరి 5 | చేవెళ్ల | జనవరి 16 | నల్లగొండ |
| జనవరి 6 | పెద్దపల్లి | జనవరి 17 | నాగర్‌కర్నూలు |
| జనవరి 7 | నిజామాబాద్ | జనవరి 18 | మహబూబ్‌నగర్ |
| జనవరి 8 | జహీరాబాద్ | జనవరి 19 | మెదక్ |
| జనవరి 9 | ఖమ్మం | జనవరి 20 | మల్కాజిగిరి |
| జనవరి 10 | వరంగల్ | జనవరి 21 | సికింద్రాబాద్, హైదరాబాద్ |

